ఇసుక ట్రాక్టర్ల ఇష్టారాజ్యం

- మితి మీరిన వేగంతో ప్రయాణం
- చోద్యం చూస్తున్న అధికారులు
- భయాందోళనలో ప్రజలు



టేకుమట్ల నుంచి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్



టేకుమట్ల–శాంతినగర్ ప్రధాన రోడ్డులో నిలిపిన ఇసుక ట్రాక్టర్

టేకుమట్ల: మండలంలోని చలివాగు, మానేరుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.పగటి పూట స్థానిక అవసరాల కోసం ఇసుకను తరలించేకునేందుకు స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణరావు, అధికారులు అనుమతులు ఇవ్వడంతో ఇసుకను చలివాగు, మానేరుల నుంచి ప్రతీ రోజు వందల కొలది ఇసుక ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇసుక ట్రాక్టర్ యజమానులు ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్‌తో ప్రయాణిస్తూ దందా కొనసాగిస్తున్నారు. ఒక వైపు యాసంగిలో చలివాగు, మానేరు పరివాహక ప్రాంత రైతులు భూగర్భ జలాలు అడుగంటి సాగు నీటి కోసం తంటాలు పడుతుంటే మరో వైపు ఇసుకను అక్రమంగా వందల ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ దందా కొనసాగిస్తున్నారు.

మితి మీరిన వేగంతో..

మానేరు నుంచి గర్మిళ్లపల్లి, వెలిశాల, పంగిడిపల్లి, ఆశిరెడ్డిపల్లి, టేకుమట్ల, రామకిష్టాపూర్ (టీ) గ్రామాల ప్రధాన కుడలీల నుంచి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో, ఎక్కువ శబ్దంతో పాటలను వింటూ డ్రైవర్లు ట్రాక్టర్లను నడుపుతున్నారు. అంతే కాకుండా ట్రాక్టర్ డ్రైవర్లు మైనర్లు కావడం, ట్రాక్టర్లకు కనీసం నంబర్ ప్లేట్లు కూడా లేకుండానే నడపడంతో అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహన డ్రైవర్ల మూలంగా ప్రమాదం సంభవిస్తే బాధ్యులు ఎవరని, ఇంతలా విచ్చలవిడిగా వాహనాలు వేగంతో ప్రయాణిస్తున్నా కనీసం అధికారులు వాటిపై దృష్టి సారించకపోవడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్లపైనే పార్కింగ్..

నిత్యం కలికోట శివారు మానేరు నుంచి టేకుమట్ల–పరకాల ప్రధాన రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ ట్రాక్టర్లను పార్కింగ్ చేస్తుండడంతో గతంలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు సంభవించిన సంఘటనలు ఉన్నాయి. కానీ ఇప్పటికీ అక్కడక్కడా రోడ్ల వెంట ట్రాక్టర్లను నిలిపి డ్రైవర్లు కాలయాపన చేస్తున్నారు. ఖాళీ ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకునే వీలున్నా రోడ్లపైనే పార్కింగ్ చేయడం మూలంగా ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

భయం భయంగా ప్రజలు

కాళేశ్వరంలోని ఇసుక క్వారీల వల్ల ఎక్కువ మొత్తంలో లారీలు కాళేశ్వరం–పరకాల ప్రధాన రోడ్డులో ప్రయాణించడం వల్ల వాహనదారులు ఆ రోడ్డులో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ట్రాక్టర్లు గర్మిళ్లపల్లి–టేకుమట్ల–పరకాల రోడ్డులో అతివేగంతో ప్రయాణించే ఇసుక ట్రాక్టర్ల మూలంగా ఇతర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. డ్రైవర్లు హెడ్‌సెట్‌లను వినియోగిస్తూ ఫోన్లను మాట్లాడుకుంటూ నడపడమే కాకుండా ఎక్కువ శబ్దంతో పాటలను వింటూ డ్రైవింగ్ చేయడం మూలంగా ప్రమాదాలకు సంకేతాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చర్య తీసుకోవాలి



మానేరు నుంచి మండల కేంద్రం వరకు గల గ్రామాల నుంచి ప్రధాన రోడ్డు ఉండడంతో నిత్యం పిల్లలు, వృద్ధులు రోడ్డువెంట వెళ్తుంటారు. ఇసుక ట్రాక్టర్ల వల్ల ప్రతి ఒక్కరూ తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పెద్ద శబ్దంతో డెక్కుల్లో పాటలను పెట్టుకుని, వర్ స్పీడ్‌తో వెళ్లడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయి. కావున అధిక స్పీడ్, ఓవర్‌లోడ్‌పై అధికారులు శ్రద్ధ చూపి నియంత్రించి ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– ఎల్కటి రాజయ్య, ఆశిరెడ్డిపల్లి

రజతోత్సవ సభకు తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం టేకుమట్ల మండలంలోని ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న సభకు ప్రతి ఇంటి నుంచి గులాబీ జెండాతో తరలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, నాయకులు ఆకునూరి తిరుపతి, బండెల నరేష్, రఘు, ఐలయ్య, సదానందం, రవీందర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్హర్: ఆదివాసీలపై దాడులకు వ్యతిరేకంగా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఈనెల 20న కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్, గణేష్ నగర్‌లో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ కరపత్రాన్ని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక కన్వీనర్ ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి పోరాటంలో ఆదివాసులపై జరిగిన హత్యకాండను నిరసిస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహిస్తున్న తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి కొమురయ్య, ఎరుకల రాజన్న, గుంటి రమేష్ ,ఆదివాసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం లచ్చన్న, గుంటి బాపు, గుంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన విగ్రహాల ఊరేగింపు

ఏటూరునాగారం: నూతనంగా నిర్మించిన అయ్యప్ప దేవాలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలను ఆదివారం అయ్యప్ప భక్తులు ప్రజలు పురవీధుల్లో మాడవీధుల్లో ఊరేగించారు. విగ్రహాలను శివాలయంలో భద్రపరిచి ఉదయం 8 గంటల నుంచి విగ్రహాల ఊరేగింపు కోసం రథాన్ని ఏర్పాటు చేశారు. ఈ రథంలో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప విగ్రహంతో పాటు వినాయకుడు, శివుడు, సుబ్రహ్మణ్యస్వామి, నంది, మాలికపు రత్తమ్మ ఇతర విగ్రహాలు ఉన్నాయి. కాగా విగ్రహాల ఊరేగింపులో అడుగడుగున భక్తులు రథానికి నీళ్ల ఆరబోసి కొబ్బరికాయలు కొడుతూ దేవుడికి మంగళహారతులు పట్టారు. ఉదయం 8 గంటలకు బయలుదేరిన రథం సాయంత్రం ఐదు గంటల వరకు అయ్యప్ప ఆలయానికి చేరుకుంది. నేటి(సోమవారం) నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన పనులు మొదలుకానున్నాయి.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో సైకిల్‌షాప్ దగ్ధం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో సైకిల్ షాప్ దగ్ధమైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బాధితుడు రత్నం సంపత్ సైకిల్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా షార్ట్‌సర్క్యూట్‌తో షాప్ కాలిపోయింది. గ్రామస్తులు స్పందించి మంటలను ఆర్పి వేశారు. డబ్బాతో పాటు, సామాను కలిపి రూ.1లక్ష వరకు నష్టం జరిగినట్లు ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు సంపత్ కోరుతున్నాడు. మంటలను ఆర్పిన గ్రామ యువకులను గ్రామస్తులు అభినందించారు.

ఆలయ నిర్మాణాలకు సహకరించాలి

ఏటూరునాగారం: మండలంలోని చలపాక గ్రామంలో గ్రామ దేవత లక్ష్మీదేవర ఆలయ నిర్మాణాలకు సహకరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘుకు చెల్పాక గ్రామస్తులు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. మీరు ఇచ్చిన వినతి పత్రాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి గుడి నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యేలా సహకరిస్తారని రఘు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

రాజ్యాధికార సాధనే బీసీల లక్ష్యం



ములుగు: రాజ్యాధికార సాధనే లక్ష్యంగా బీసీలు ఏకతాటిపైకి రావాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లాల పర్యటనలను విజయవంతంగా పూర్తి చేసి కమిటీలు వేశామని అన్నారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి ముంజాల రాజేందర్‌గౌడ్, జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రేగొండ: మండలంలోని రాయపల్లి గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు నీటూరి శ్రీనివాసరావు తల్లి నీలమ్మ విద్యుత్‌షాక్‌కు గురై ఆదివారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పాపయ్య, దాసరి తిరుపతిరెడ్డి, సయ్యద్ గాలిఫ్, సాదు దేవేందర్, ఎర్ర రాకేష్‌రెడ్డి, సేరెళ్ల శంకర్, దయ్యాల కిరణ్ ఉన్నారు.

గుట్టపై ట్రాఫిక్ జామ్



వాజేడు: గుట్ట పైన జాతర జరిగే చోట మలుపు వద్ద ఆదివారం ట్రాఫిక్ జామ్ అయింది. భారీ లారీ ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్తున్న క్రమంలో మలుపు వద్ద ఆటో ద్విచక్ర వాహనాలను అడ్డుగా ఉంచారు. లారీ మలుపు వద్దకు రాగానే ఎదురుగా వెళ్లిన ఒక కారు వెనుకకు రాకుండా మూల లారీ పక్క నుంచి సందులోకి తీసుకువెళ్లాడు. కారు వెనుకగా మరి కొన్ని ద్విచక్రవాహనాలు వచ్చి చేరాయి. దీంతో అటు కారు, ఇటు లారీ ఎటూ కదిలే పరిస్థితి. వాహన దారులు ఇబ్బందులు పడగా లారీని కొంచెం కొంచెం ముందుకు జరుపుతూ అర్ధగంట తరువాత క్లియర్ చేశారు.

కాల్వ నీటిని విడుదల చేయాలి

ములుగు రూరల్: ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసేలా మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్‌ను సీపీఎం నాయకులు కోరారు. ములుగు మండలంలోని రాయినిగూడెం ప్రాంతంలో నీరు లేక ఎండిపోతున్న మొక్కజొన్న పంటను పరిశీలించి అధికారుల తీరుపై నిరసన తెలిపారు. మరో 10 రోజుల పాటు నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిగౌడ్, మంకిడి కృష్ణ, గుండెబోయిన వెంకటేశ్వర్లు, గొంది సాంబయ్య, ఈసాల పాపయ్య, రాములు, స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు

ములుగు/మంగపేట: అకాల వర్షాల కారణంగా పంటలు నష్ట పోయిన రైతులు అధైర్య పడొద్దని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం సీతక్క 'సాక్షి'తో మాట్లాడుతూ.. మంగపేట మండలంలోని మొట్లగూడెంలో ఈనెల 10 ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో వైద్యం పొందుతూ యాలం నర్సింహారావు మృతి చెందడంపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యం వలన పంటలు నష్ట పోయిన రైతులను ప్రజా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. గ్రామాల్లో జరిగిన పంట నష్టం పరిశీలనకు వచ్చే అధికారులకు పంట నష్ట పోయిన రైతులు వివరాలు జరిగిన నష్టాన్ని వివరించాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వ విద్యార్థులు పసుల రాజు చింతల మహేందర్, భానుచందర్, నూర్జాహన్, లక్ష్మీ, సాంబయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి



మల్హర్: శ్రీపాదరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



మహదేవపూర్ : శ్రీపాదరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మల్హర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు వర్ధంతిని మండలంలోని కొయ్యూర్‌లో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు విగ్రహానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్, కాళేశ్వరం, అన్నారం, పలుగులతో పాటు పలు గ్రామాల్లో దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతిని ఆదివారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ రెవెల్లి మమతనాగరాజుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహదేవపూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ రాణిబాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



వార్డు ఇన్‌చార్జ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జ్ బీతి పృధ్వీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. వార్డు ప్రజల సమస్యలతో పాటు, మౌలిక, పారిశుద్ధ్య పనులు పరిష్కరించే విధంగా చూడాలని స్థానిక వార్డుల ఇన్‌చార్జులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, కురిమిల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, జిల్లా నాయకుడు ఆకుల మహేందర్, 29వవార్డు ఇన్‌చార్జ్ పుల్ల మహేష్,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీసులు, సిబ్బంది

ఏటూరునాగారం: మనం పరిసర ప్రాంతాల్లో సంభవించే ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విపత్తు స్పందన అగ్నిమాపక సేవల పోస్టర్‌ను ఎస్సై తాజొద్దీన్‌తో కలిసి అగ్నిమాపక సిబ్బంది ఆవిష్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. విద్యుత్ కనెక్షన్, సరఫరాలో తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. అగ్నిప్రమాదాల సమయంలో పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు

గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై తాజుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని బెస్తగూడెంలో ఆదివారం తాండ్ర రాము అనే వ్యక్తి వద్ద 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు గుడుంబా మహమ్మారికి బానిసై కుటుంబంలో తగాదాలు పెట్టుకోవద్దని గుడుంబాను గ్రామాల నుండి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఎవరైనా గుడుంబా విక్రయాలు జరుపుతున్న గుడుంబా బట్టీలు పెట్టిన పోలీస్ శాఖ వారికి సమాచారం అందించాలని తెలిపారు.

కొనసాగుతున్న బీరమయ్య జాతర

- హర హర నామస్మరణతో మార్మోగిన లొట్టిపిట్ట గండి ప్రాంతం
- దేవర్ల రాకతో మొదలైన జాతర తంతు
- తరలివచ్చిన భక్తులు



జాతరలో భక్తుల సందడి

వాజేడు: లొట్టిపిట్ట గండి ప్రాంతం ఆదివారం తెల్లవారు జాము నుంచి హర హర నామ స్మరణతో మార్మోగింది. మండు టెండల్లో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన లొట్టిపిట్ట గండి వద్ద కొండలపైన గిరిజనుల ఆరాధ్య దైవమైన బీరమయ్య (భీష్మశంకరుడు) జాతర శనివారం రాత్రి నుంచి కోలాహలంగా ప్రారంభమైంది. జాతరకు తరలి వచ్చిన భక్తుల హర హర ఓం నాథంతో కొండ ప్రాంతం మార్మోగింది. ఆదివారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో సమీప గోదావరిలో నిష్టతో స్నానాలు ఆచరించి బీరమయ్య, రేఖలమ్మలకు ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం కల్యాణం నిర్వహించారు. ఆ సమయంలో భక్తులు శివనామ స్మరణతో ఊగి పోయారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులను సమర్పించుకున్నారు. బీరమయ్యకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లను చేశారు. గోదావరి వద్ద పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు ప్రమాదానికి గురి కాకుండా ఆలయ కమిటీ పలు జాగ్రత్తలు చేపట్టింది. జాతరకు తరలి వచ్చిన భక్తుల దాహం తీర్చడానికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టాంకర్ ద్వారా తాగు నీటిని అందించారు. పేరూరు వైద్య సిబ్బంది జాతర ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీరమయ్య జాతర ముగిసిన తరువాత ఆయన ధర్మ పత్ని ఐన రేఖలమ్మకు మండల పరిధిలోని అయ్యవారి పేట గోదావరి సమీపంలో తిరుగు వారం రోజున జాతరను జరిపించనున్నారు.

బస్సుల ఏర్పాటు లేదు

ప్రతీ ఏడాది బీరమయ్య జాతర సమయంలో భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడిపేవారు. కాని ఈ ఏడాది బస్సులను నడుపలేదు. దీంతో జాతరకు వచ్చే భక్తులు ప్రైవేట్ వాహనాల ద్వారా ఆలయానికి చేరుకున్నారు.



బీరమయ్య దేవుడికి మొక్కుతున్న మహిళలు



గుట్టపైకి చేరుకుంటున్న భక్తులు



దేవుడికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

బోరు మోటారు అందజేత



మోటారు ఏర్పాటు చేయిస్తున్న జనార్దన్

కాటారం: కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పలగూడెంలో బోరుబావి మోటార్ చెడిపోయి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. కాలనీవాసులు గత కొన్ని రోజులుగా సమీపంలోని పంట చేల నుంచి నీరు మోసుకొచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. బోరుబావి మరమ్మతుకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసుల ఇబ్బందులు మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్ దృష్టికి తీసుకురావడంతో ఆదివారం బోరుబావికి నూతన మోటార్ ఏర్పాటు చేయించారు. ఎండాకాలంలో నీటి ఎద్దెడి తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. నీటి ఇబ్బంది తొలిగిపోవడంతో ఈ సందర్భంగా కాలనీవాసులు జనార్దన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లింగారెడ్డి

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి లింగారెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాల ప్రకారం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలన్నారు. ఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో 20శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని కోరారు. డీఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కామన్ విద్యావిధానాన్ని అమలు చేయాలని కోరారు.

రెండు ఇసుక లారీల ఢీ..

వెంకటాపురం(కె): మండల పరిధిలోని సూరవీడు గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్ర ఎదురెదురుగా వస్తున్న ఇసుక లారీలు ఢీకొని ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. గ్రామస్తుల క థనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర మండలం నుంచి వస్తున్న ఇసుక లారీని వెంకటాపురం మండలం వైపు నుంచి చర్ల వెళ్తున్న ఇసుక లారీలు సూరవీడు గ్రామ సమీపంలో ఎదురు ఎదురుగా ఢీకొట్టడంతో మిర్యాలగూడకు చెందిన సతీష్‌కు కాలుకు, కర్నూల్‌కు చెందిన భాస్కర్‌కు తోడల వద్ద, తలకు ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలైయి లారీలో ఇరుక్కు పోయారని తెలిపారు. గ్రామస్తులు లారీల్లో ఇరుక్కుపోయిన డ్రైవర్లను బయటకు తీసు 108 కు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు.

నియామకం



భిక్షపతి, అధ్యక్షుడు



ఓం ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి

ములుగు: శ్రీ బాలాజీ మున్నూరుకాపు సహకార పరపతి సంఘం జిల్లా అధ్యక్షుడిగా వరుసగా మూడవసారి చింత నిప్పుల భిక్షపతి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వరుసగా రెండవ సారి పొడాల ఓం ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన సంఘం సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తోట తిరుపతి, కోశాధికారిగా సముద్రాల రఘు, సంయుక్త కార్యదర్శిగా సురేశ్, కార్యవర్గ సభ్యులుగా గంధె మధు, రాజు, భిక్షపతి, కుమార్, విజేందర్, సహాయ కార్యనిర్వహణ కార్యదర్శిగా చక్రపు రాజు ఎన్నికయ్యారు.